నమస్తే తెలంగాణ
నిజామాబాద్, సోమవారం 15 జనవరి 2024
MONDAY, JANUARY 15, 2024

ఘనంగా భోగి

- పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు
- గాలిపటాలు ఎగురవేసి సందడి చేసిన చిన్నారులు, యువకులు

నగరంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో భారత జాగృతి ఆధ్వర్యంలో భోగి కార్యక్రమం..

జెండా బాలాజీ ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఇందూరు తిరుమలలో పూజల్లో పాల్గొన్న దిల్‌రాజు దంపతులు

డిచ్‌పల్లి పోలీస్ బెటాలియన్‌లో భోగిమంటలను వెలిగిస్తున్న కమాండెంట్ రాంప్రకాశ్

రుద్రూర్ మండల కేంద్రంలో భోగి మంటలు

రుద్రూర్ ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 14 : జిల్లా వ్యాప్తంగా భోగి పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు ఇండ్ల ఎదుట ఉదయం కల్లాపి చల్లి వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. తెల్లవారుజామున భోగి మంటలు వేశారు. ఇండ్లలో పలువురు పిండి వంటకాలు చేశారు. డీజే చప్పుళ్ల మధ్య చిన్నారులు, యువత గాలిపటాలు వేస్తూ సందడి చేశారు. పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన ప్రాంగణంలో వైద్యులు కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్, శ్రీశైలంతో పాటు నగరంలోని ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

భారత జాగృతి ఆధ్వర్యంలో ..

నగరంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో భారత జాగృతి ఆధ్వర్యంలో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బసవన్నల విన్యాసాలు, పాలు పొంగించడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతిరావు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, జాగృతి రాష్ట్ర నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, అపర్ణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలోని గ్రీన్‌ల్యాండ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం భోగి మంటలు వేశారు. అనంతరం చిన్నారులకు పతంగుల ఎగురవేత పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కమ్మర్‌పల్లి మండలంలోని హసాకొత్తూర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు మహాదేవస్వామి ఆలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రజినీకాంత్, కార్యదర్శి శ్రావణ్, ఉపాధ్యక్షుడు రాజుల చిన్నబాలయ్య, క్యాషియర్ రాజారపు నర్సయ్య, రైటర్ పెద్ది ధన్‌రాజ్ పాల్గొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో చిన్నారులకు గాలిపటాలను బీసీ సంక్షేమ సంఘం బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడు మొండి అశోక్ పంపిణీ చేశారు. ఆర్మూర్ పట్టణంలో యువకులు గాలిపటాలను ఎగురవేశారు. మాక్లూర్ మండలంలో ప్రజలు భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. చిన్నారులను చెరుకు బుగ్గలు, భోగి పండ్లు (రేణిపండ్లు)తో అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

రుద్రూర్, కోటగిరిలో ఉదయం భోగి మంటలు వేసి ఆడిపాడారు. రుద్రూర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ శ్రమ సంఘం ఆధ్వర్యంలో యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. సారంగాపూర్ కోదండ రామాలయంలో భోగి మంటలు నిర్వహించిన అనంతరం గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఉన్న వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

డిచ్‌పల్లిలోని పోలీస్ ఏడో బెటాలియన్ ప్రాంగణంలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. కమాండెంట్ రాంప్రకాశ్ ఆధ్వర్యంలో ఆవరణలో ఉదయం భోగి మంటలు వేశారు. అనంతరం రంగనాథ స్వామి – గోదాదేవి కల్యాణం నిర్వహించారు.

మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల ఆలయంలో గోదాదేవి కల్యాణం వేదపండితుడు సంపత్‌కుమారాచార్య, రోహిత్ కుమారాచార్య ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణానికి ప్రముఖ నిర్మాత, ఆలయ కమిటీ చైర్మన్ దిల్‌రాజు దంపతులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయ సింహారెడ్డి, నరాల సుధాకర్, నర్సారెడ్డి, రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలోని జెండా బాలాజీ మందిరం, సుభాష్‌నగర్ రామాలయం, ఎల్లమ్మగుట్టలోని లక్ష్మీ వేంకటేశ్వరాలయం, ఆర్యనగర్‌లోని వేంకటేశ్వరాలయం, చక్రంగుడి లక్ష్మీ వేంకటేశ్వరాలయాల్లో, ఉత్తర తిరుపతి క్షేత్రంలో గోదాదేవి కల్యాణాన్ని ఆగమ శాస్త్ర పద్ధతిలో నిర్వహించారు. నెల రోజులుగా కొనసాగుతున్న తిరుప్పావై ప్రవచనాలు భోగితో పరిపూర్ణమయ్యాయి. ప్రవచనాలు చేసిన వేద పండితులను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

బోధన్ పట్టణం వెంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ మండపంలో గోదారంగనాథుల విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆర్మూర్ పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నగరంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో గోదాదేవి – రంగ నాయక స్వామి కల్యాణంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సాయంత్రం మహిళలు ఇండ్లలో దీపాలు వెలిగించాలని ఆయన కోరారు.

బోధన్‌లో గోదారంగనాథుల కల్యాణం..

హసాకొత్తూర్‌లో బహుమతులు అందజేస్తున్న వీడీసీ సభ్యులు

వేల్పూర్ మండల కేంద్రంలో పతంగుల పంపిణీ..

ఆర్మూర్‌లోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న గోదాదేవి-రంగనాథ స్వామి

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సురేందర్‌రెడ్డి

చందూర్, జనవరి 14 : బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగను కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని, సంక్రాంతి ప్రజలందరికీ మరింత ఆనందం పంచాలని ఆకాంక్షించారు.

ఆర్మూర్ ఎమ్మెల్యే..

ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌లో ఉన్న తన స్వగృహంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి భోగి పండుగను నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

ఇందల్వాయి, జనవరి 14 : మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో అయోధ్య రాముడి పూజిత అక్షింతలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు ఇంటింటికీ తిరిగి అక్షింతలను అందజేశారు. ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా ఇంట్లో దేవుడి విగ్రహాలపై అక్షింతలు చల్లి, పూజలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ నవీన్‌గౌడ్ పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని పేపర్‌మిల్ గ్రామంలో అయోధ్య అక్షింతలతో గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు.

సాఫ్ట్‌బాల్ ప్రథమ, తృతీయ స్థానాల్లో జిల్లా జట్లు

కంఠేశ్వర్, జనవరి 14 : సిద్దిపేట జిల్లా కొండపాకలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన 67వ స్కూల్‌గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అండర్–19 రాష్ట్ర టోర్నమెంట్‌లో నిజామాబాద్ జిల్లా బాలికల, బాలుర జట్లు ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల జట్టు మహబూబ్‌నగర్ జట్టుపై 10–0తో గెలుపొంది ప్రథమ స్థానంలో, బాలుర జట్టు వరంగల్ జట్టుపై 10–01 తేడాతో తృతీయ స్థానంలో నిలిచింది. నిజామాబాద్ జిల్లా జట్టుకు సిద్దిపేట్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాసం, స్కూల్ గేమ్స్ అబ్జర్వర్ నీరజా రెడ్డి, నిజామాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి బహుమతులు అందజేసినట్లు అండర్–19 గేమ్స్ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. జిల్లా జట్టుకు కోచ్, మేనేజర్లుగా మర్కంటి గంగామోహన్, సొప్పరి వినోద్, జ్యోత్స్న, రాజేందర్, గంగాధర్ వ్యవహరించారు.

సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా సత్తా

బహుమతులతో జిల్లా క్రీడాకారులు

కంఠేశ్వర్, జనవరి 14 : ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జనగామ జిల్లాలో జాతీయ సీనియర్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ తెలిపారు. బాలికల విభాగంలో మమత, రాణి, సౌమ్యారాణి, బాలుర విభాగంలో సెంథిల్, ప్రశాంత్, అఖిల్, వినయ్ ప్రాతినిధ్యం వహించి, ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. బాలికల విభాగంలో ప్రథమస్థానంలో నిలువగా, బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో సీనియర్ బాలికల విభాగంలో ఉత్తమ పిక్చర్‌గా ఎల్. రాణి, ఉత్తమ బ్యాటర్‌గా జి.మమత ప్రత్యేక బహుమతులు అందుకున్నట్లు తెలిపారు.

గుండారం పాఠశాల విద్యార్థులకు అంతర్జాతీయ కవితా బహుమతులు

సారంగపూర్, జనవరి 14 : కెనడా దేశం కేంద్రంగా వెలువడుతున్న అంతర్జాతీయ పిల్లల మాసపత్రిక 'గడుగ్గాయి' నిర్వహించిన సంక్రాంతి కవితల పోటీల్లో గుండారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారని ప్రధానోపాధ్యాయుడు బి.అమర్‌నాథ్ తెలిపారు. ఆదివారం ఆ పత్రిక ప్రకటించిన కవితా విజేతల్లో శ్రుతిరెడ్డి (9వ తరగతి) ప్రథమ బహుమతుల్లో ఒకరిగా నిలిచిందని, ద్వితీయ బహుమతుల్లో విజేతలుగా 9వ తరగతి చదువుతున్న లాస్య, ఐశ్వర్య, కృష్ణవేణి, నిహారిక, సింధూజ, ఎన్.వైష్ణవి (7వ తరగతి) ఉన్నారని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కవితాసృజనను వెలికితీస్తూ మార్గదర్శనం చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేశ్‌రావు, వారె దస్తగిరితోపాటు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోటగిరి, జనవరి 14 : ఉమ్మడి కోటగిరి మండలంలోని పొతంగల్, సుంకిని నుంచి ఆదివారం ఉదయం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. పొతంగల్ మంజీరా నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, సుంకిని మంజీరా నది నుంచి రెండు ట్రాక్టర్లను పట్టుకొని, కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. తగు చర్యల నిమిత్తం సంబంధిత శాఖ అధికారులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

తిమ్మాపూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

మోస్రా (చందూర్), జనవరి 14 : మోస్రా మండలంలోని తిమ్మాపూర్‌లో గ్రామ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం సర్పంచ్ సున్నం భూమయ్య ప్రారంభించారు. టోర్నమెంట్ ఈనెల 16వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, క్రీడాకారులు, యువత పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

భీమ్‌గల్‌లో టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

భీమ్‌గల్, జనవరి 14: పట్టణంలో వేముల మంజులమ్మ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను గడ్డ గ్రౌండ్‌లో (బడాభీమ్‌గల్ రోడ్డు) ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ మహేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ టోర్నీ ఏర్పాటు చేసిన బొర్ర హనుమాన్ యూత్ అసోసియేషన్ (బొదిరెగల్లీ) యూత్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కన్నె సురేందర్, శర్మానాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరే నర్సయ్య, సీహెచ్. గంగాధర్, బోర్ లింగం, మల్లెల ప్రసాద్, మోదిరె తిరుపతి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చింరాజ్‌పల్లిలో ..

నందిపేట్, జనవరి 14: మండలంలోని చింరాజ్‌పల్లిలో గ్రామయువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చింరాజ్‌పల్లి క్రికెట్ లీగ్‌ను స్థానిక పీఏసీఎస్ చైర్మన్ బొంకం గంగారెడ్డి ఆదివారం ప్రారంభించారు. రాజేంద్ల రవితేజ, మాడబోయి జ్ఞానేశ్వర్ స్మారకార్థం ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కమ్మర్‌పల్లి, జనవరి 14: ఉప్లూర్‌లో అయ్యప్ప స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోమవారం సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయం వద్ద అఖండ జ్యోతి దివ్య దర్శనం, ఇతర కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

శక్కర్‌నగర్, జనవరి14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జాతీయ వికలాంగ హక్కుల వేదిక బోధన్ గౌరవ అధ్యక్షుడు ఏశాల గంగాధర్ అన్నారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆ సంఘం క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకుడు గైని రాములు, షేక్ నజీర్, గిజ్జి ఎల్లయ్య, బాలమణి, పల్లికొండ చింటు, సాయినాథ్, మంజు, సాయిలు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా గృహిణి అదృశ్యం

శక్కర్‌నగర్, జనవరి 14: బోధన్ పట్టణంలోని బీటీనగర్‌కు చెందిన భవానీ తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య ఆదివారం తెలిపారు. ఈ విషయమై ఆమె భర్త శంకర్ ఆదివారం ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. ఆమె భర్త పనుల కోసం బయటికి వెళ్లగా ఈనెల 9న తన పిల్లలతో కలిసి భవానీ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'సరిహద్దు'లో సంక్రాంతి

- విభిన్నంగా వేడుకలు
- ప్రకృతి ఆరాధన.. చేలల్లో పూజలు

బోధన్, జనవరి 14: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మంజీర తీరం,మహారాష్ట్రకు సరిహద్దుగా ఉండే గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు విభిన్నంగా జరుపుకొంటారు. మహారాష్ట్ర సంస్కృతీ ప్రభావంతో పండుగను చేలు, పంట పొలాల్లో జరుపుకొంటున్నారు.

ఏపీలోని కోస్తా జిల్లాల నుంచి వలస వచ్చి స్థిరపడిన కుటుంబాలతో ఏర్పడిన కాలనీలు, క్యాంప్‌ల్లో మాత్రం ఇండ్లన్నీ పండుగ వేడుకలతో సందడిగా ఉంటాయి. సరిహద్దు గ్రామాల్లో చేలల్లోనే పూజలు, నైవేద్యాలతో భోజనాలు ఉంటుండగా, క్యాంప్‌ల్లో మాత్రం రకరకాల పిండివంటల ఘుమఘుమలు, ఆడపిల్లల ఆటాపాటలు, చిన్నారులకు భోగిపండ్లు, కొత్త అల్లుళ్లకు రాచమర్యాదలు.. సర్వసాధారణంగా కనిపిస్తుంటాయి. ఇలా.. మంజీర తీరాన రకరకాల సంస్కృతులతో సంక్రాంతిని పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది..

ప్రకృతి ఆరాధనతో సంక్రాంతి సంబురం

మంజీర తీరంలోని గ్రామాల్లో ప్రకృతి ఆరాధన, పంటలకు పూజలే ప్రధానంగా కనిపిస్తాయి. తెలంగాణాలోని మిగతా ప్రాంతాలకు కొంచెం భిన్నంగా సరిహద్దు ప్రాంతాల్లో సంక్రాంతి వేడుకలను జరుపుకొంటారు. బోధన్, రెంజల్, కోటగిరి, మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ తదితర మండలాలతో పాటు అటు మెదక్‌లోని నారాయణ్‌ఖేడ్ ప్రాంతంలో ప్రకృతి ఆరాధనే ప్రధానంగా సంక్రాంతి పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. సాధారణంగా సంక్రాంతి పండుగంటే ఇండ్లలో కోలాహలం ఉండగా.. సరిహద్దు గ్రామాల్లో మాత్రం ఆ సందడి చేలల్లో కనిపిస్తుంటుంది. పండుగ రోజున చేలకు నైవేద్యాలు తీసుకెళ్లి, పూజలు చేసి, అక్కడే భోజనాలు ముగించుకుని సాయంత్రం ఇండ్లకు వెళ్తారు.

పంటలను కాపాడాలంటూ..
పంచపాండవులకు పూజలు

సంక్రాంతి పండుగకు, పంటలకు ఎంతో అవినాభావ సంబంధం ఉంది. ఏ ప్రాంతంలో సంక్రాంతి పండుగ జరిగినా ఆ వేడుకలు పంటలతో ముడిపడివుంటాయి. సరిహద్దు ప్రాంతంలో సంక్రాంతి పండుగ సమయానికి జొన్న, శనగ, ఇతర పంటలు ఏపుగా ఎదుగుతున్న దశలో ఉంటాయి. ఈ పంటలను కాపాడుకోవాలన్న తపన వ్యవసాయ కుటుంబాల్లో ఎక్కువగా ఉంటుంది. అందుకే సంక్రాంతి రోజు చేలల్లో పంచ పాండవులకు పూజలు చేయడం, మొక్కలకు మొక్కడం, వాటికి రవికెను సమర్పించడం.. ఇలా ఎంతో విలక్షణంగా ఇక్కడి గ్రామీణ ప్రజలు చేస్తుంటారు.

పండుగ రోజు ఇలా...

సంక్రాంతి రోజున ఇక్కడ కుటుంబసభ్యులంతా పిండివంటలు, ఇతర నైవేద్యాలను వండుకొని సొంత చేలకు వెళ్తారు. ఎండు జొన్న కట్టలను ఒక చిన్న గుడిసెలాగా పేర్చి, అందులో జాజుపూసిన ఐదు చిన్న రాళ్లను ఉంచుతారు. వాటిని పంచపాండవులుగా భావించి పూజలు చేస్తారు. పంచ పాండవుల్లో కుంతీదేవి పుత్రులైన ధర్మరాజు, భీముడు, అర్జునుడి ప్రతిమలను తూర్పు వైపు, మాద్రి పుత్రులైన నకల, సహదేవుల ప్రతిమలను పడమర వైపు ఉంచుతారు. ఈ పంచపాండవులను తమ పొలాలను, చేలను కాపాడాలని ప్రార్థిస్తూ పూజలు చేస్తారు. అనంతరం కొన్ని మక్కజొన్న మొక్కలను ఒకదానితో ఒకటి కలిపి, ఒకచోట నాటుతారు. అక్కడ ఆ మొక్కలకు రవికెను తొడిగి, పూజలు చేస్తారు. పంటల లక్ష్మి తమ ఇంటికి తరలిరావాలని కోరుకుంటుంటారు.

ఇక్కడే మరో విలక్షణ సంస్కృతి

సరిహద్దులో ఒకపక్క మహారాష్ట్రతో అనుబంధం కలిగిన తెలంగాణ ప్రజలు పంచపాండవులు, మొక్కల పూజలతో సంక్రాంతిని జరుపుకుంటుండగా, వారితో మమేకమై జీవనం గడుపుతూ.. ఎప్పుడో కోస్తా జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన ప్రజల సంక్రాంతి పండుగ ఎంతో విలక్షణంగా ఉంటుంది. నిజానికి సెటిలర్స్ క్యాంప్‌ల్లో సంక్రాంతి ఒక పెద్ద పండుగ.. అరిసెలు తదితర పిండివంటలతో పాటు సంక్రాంతి రోజున గారెలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. సంక్రాంతికి తప్పనిసరిగా కొత్త బట్టలు కట్టుకుంటుంటారు. ఇక, కొత్త అల్లుళ్లకు సంక్రాంతిరోజున అత్తగారింట్లో దొరికే మర్యాదలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎక్కడెక్కడో ఉపాధిని పొందుతున్న కుటుంబసభ్యులంతా సంక్రాంతి రోజున కలుసుకోవడం వీరి ప్రత్యేకత.. కొన్ని క్యాంప్‌ల్లో ఊరుఊరంతా ఇదే పండుగ రోజున కలుసుకుంటారు. పట్టు పరికిణిలతో సందడి చేసే ఆడపిల్లలు, అందమైన రంగవల్లులతో ఆకాశంలోని చుక్కలే.. భూమికి దిగి వచ్చాయా అన్నట్లు కనిపించే వీధులు.. సంక్రాంతి ప్రత్యేక వంటల ఘుమఘుమలు.. ఇలాల అందుకే సంక్రాంతి పండుగ వేల క్యాంప్‌లు కళకళలాడుతుంటాయి.

పంట చేనులో పండుగ జరుపుకొంటున్న
బోధన్ మండలం కల్దుర్కి గ్రామానికి చెందిన ఒక కుటుంబం

చేనుల్లోనే పండుగ చేసుకుంటాం..

మా సరిహద్దు గ్రామాల్లో చేండ్లల్లోనే పండుగను చేసుకుంటుంటాం.. సంక్రాంతి పండుగ రోజున ఇంటిలోని చిన్నా, పెద్దా అందరం కలిసి పంట పొలాలకు వెళ్తాం.. ఇండ్లలోనే నైవేద్యాలు తయారుచేసుకుని వెంబడి తీసుకుపోతాం. పంటలను కాపాడాలంటూ పంచ పాండవులకు పూజలు చేస్తాం.. పూజల అనంతరం అక్కడే నైవేద్యాలతో కూడిన అన్నం, రొట్టెలు, కూరలతో భోజనాలు చేస్తాం..ప్రకృతిని ఆరాధించడం కోసమే ఇలా మా గ్రామాల్లో సంక్రాంతి పండుగను చేసుకుంటుంటాం.. పంట పొలాల్లో పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. **- అల్లె లావణ్య, సాలూర**

PUBLIC NOTICE

General Public are hereby informed that my client **Smt.Sirina Rukmini W/o S.Prabhakar** was absolute owner of the below mentioned schedule property through Regd. Gift (Settelment) Deed No.79/1997 & & Regd. Supply mental Deed No.6431/2023, obtained necessary documents in originals.

That my client lost the link document in original **Regd. Sale Deed No. 2284/1980,** while travel from Phulong "X" Road in Auto towards Aryanagar, Nizamabad, on that lodged police complaint at P.S, IV-Town, Nizamabad, on that issued certificate on 30.12.2023, stating that the original link document/s stated above is not traced out and while obtaining the loan from the bank/s/ financial institutions/ Sale to third parties, etc., intend to offer/Submit/give the certified copy of the same, along with other documents.

Therefore, call upon general public/ financial institutions having any objections/ charge/ claim/ right/ interest, in this regard may put forth any such claim or objections before the undersigned within 7 days from the date of this publication, failing which no claim/ objections will be entertained.

SCHEDULE OF PROPERTY

All that the open Plot No.18, Ext.427.77 Sq. yds, lies in Sy.No.328, situated at Ward No.1, Block No.1, Vinayakanagar, Nizamabad within the Municipal limits of Nizamabad. **As Bounded by: North:** Neighbors Plot; **South:** Plot.No.18 & 17 of Akula Sharada Bai, **East:** 28'.0" Wide Road, & **West:** Plot.No.10 of D.Gangamani.

Sd/- E.JAYASIMHA, Advocate, Nizamabad, Cell No.9490242033.

ప్రైవేటు బస్సులో భారీ చోరీ

- బ్యాగులోని రూ.11.80లక్షలు అపహరణ
- సీసీ కెమెరాకు చిక్కిన నిందితులు

వినాయక్‌నగర్, జనవరి 14 : ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి బ్యాగులో నుంచి రూ.11.80లక్షలను దుండగులు అపహరించిన ఘటన నిజామాబాద్ జిల్లాలో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లాకు చెందిన హన్మంతు అనే వ్యక్తి మహారాష్ట్రలోని ముంబై నగరంలో ఓ తాడి(కల్లు)బట్టీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆ బట్టీ యజమాని సైతం జగిత్యాలకు చెందినవాడే. మేనేజర్ హన్మంతు సంక్రాంతి పండుగ కోసం ముంబై నుంచి జగిత్యాలకు వస్తుండగా యజమాని రూ.11.80లక్షలు ఇచ్చి తన ఇంట్లో ఇవ్వాలని చెప్పాడు. దీంతో ఆ డబ్బులను తీసుకొని శనివారం మధ్యాహ్నం ముంబైలో ఓ ప్రైవేటు బస్సులో ఎక్కాడు. ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లి వద్ద ఉన్న భవానీ హోటల్ వద్ద టీ తాగేందుకు డ్రైవర్ బస్సును నిలిపాడు. అదే సమయంలో బస్సు ముందర సీటులో కూర్చొని ఉన్న హన్మంతు డబ్బులతో ఉన్న బ్యాగును సీటుపై పెట్టి కిందికి దిగాడు. సుమారు అరగంటపాటు బస్సు నిలపడంతో ఇదే అదనుగా భావించిన దుండగులు ముందర సీటులో ఉన్న బ్యాగును ఎత్తుకొని ఉడాయించారు. బస్సు కదిలే సమయంలో హన్మంతు వచ్చి చూడగా తన సీటుపై ఉంచిన డబ్బుల బ్యాగు కనిపించలేదు. చోరీకి గురైందని గ్రహించి వెంటనే బస్సు డ్రైవర్‌కు చెప్పడంతో వెంటనే ఆరో టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సౌత్ రూరల్ సీఐ వెంకట నారాయణ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. డబ్బులు ఉన్న బ్యాగును మాస్క్ ధరించి వచ్చిన ఓ గుర్తు తెలియని దుండగుడు తీస్తున్నట్లుగా బస్సులో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అంతేకాకుండా నిందితుడి వెంట వచ్చిన మరో ఇద్దరు సైతం బస్సు డోర్ వద్ద నిలబడి ఉండడం సైతం సీసీ కెమెరాలో రికార్డయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చోరీ జరిగిన పరిసరాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

చోరీ జరిగింది
ఈ బస్సులో నుంచే..

కోనేరులో మునిగి వ్యక్తి మృతి

నందిపేట్, జనవరి 14: ఖుద్వాన్‌పూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలోని కోనేరులో మునిగి బజోల్ల గంగాధర్(47) మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ ఆదివారం తెలిపారు. రూరల్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ దర్శనానికి వచ్చాడు. కోనేరులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు అభిలాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పంచనామా నిర్వహించామని ఎస్సై రాహుల్ వివరించారు.

నిరుపేదలకు అన్నదానం

శక్కర్‌నగర్, జనవరి 14: లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ రాయల్ ఆధ్వర్యంలో లయన్ జి.రవీందర్ సహకారంతో ఆదివారం బోధన్ బస్టాండ్‌లో నిరుపేదలకు అన్నదానం చేశారు. లయన్స్ హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో భాగంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ దమ్మళ్ల జ్యోతిరాజ్, ప్రతినిధులు లయన్ రమేశ్ పవార్, లయన్ కటకం రమేశ్ పాల్గొన్నారు.